క్లుప్తంగా

వెంకటేష్‌ను కలిసిన గ్రామకాపులు



వెంకటేష్‌తో మాట్లాడుతున్న గ్రామ కాపులు

చీరాల: వేటపాలెం మండలం కటారివారిపాలెంలో నూతనంగా ఎన్నుకున్న గ్రామ కాపు పెద్దలు మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ మొదటి కాపు కటారి బిట్ట, రెండో కాపు కటారి సోమయ్య, మూడో కాపు కొండూరి జాలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

బల్లికురవ: విద్యుత్ అక్రమ వాడకం చట్టరీత్యా నేరమని.. ఎంతటి వారిపైనైనా కేసులు నమోదుతో పెనాల్టీ విధిస్తామని ఒంగోలు విజిలెన్స్ డీఈ టీ హైమావతి, అద్దంకి ఈఈ ఎన్ మస్తాన్ రావు మంగళవారం తెలిపారు. మండలంలో 31 టీమ్‌లు 1334 సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమ వాడకం గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లు తీసుకుని దుకాణాలకు, మీటరు లేకుండా అక్రమ వాడకం అదనపులోడుకు సంబంధించి 77 మందికి రూ. 3.98 లక్షలు జరిమానా విధించారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

చీరాల: ఎన్‌సీసీలో చేరడం ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవరుతాయని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి. రవికుమార్ అన్నారు. మంగళవారం కంబైండ్ ఎన్యూవల్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొనేందుకు చీరాల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు వెళ్లారు. ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో జరిగే నేషనల్ క్యాంపునకు మరో 15 మంది ఎంపికయ్యారన్నారు. సీ సర్టిఫికెట్‌తో మంచి ఉద్యోగాలు దక్కించుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి హరీష్, క్యాడెట్లు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

బల్లికురవ: పని నిమిత్తం బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టటంతో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని అంబడిపూడి–దర్శి రోడ్డులో జంక్షన్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన ముద్దపాటి లక్ష్మీనారాయణ బైక్‌పై మార్టూరు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. గాయాలపాలైన లక్ష్మీ నారాయణను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

1100 మందికి సర్టిఫికెట్లు పంపిణీ

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో అధికారులు 1100 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరెడ్డి, ఎంపీడీఓ కృష్ణకుమారి, మండల స్పెషల్ ఆఫీసర్లు ఏ. సాంబశివరావు, ఏడీఏ మోహన్‌రావు, ఏవో ఆదినారాయణ, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దారు మస్తాన్ రావు, వీఆర్వోలు సత్యనారాయణ, వసంత రావు, సర్పంచ్ మేకా సుధాకర్, కార్యదర్శి భాగ్యరాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈ గోవిందరెడ్డి

వేటపాలెం: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ గోవిందరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో సచివాలయ ఇంజినీర్లతో సమావేశం మంగళవారం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ ఇంకా గృహాలు ప్రారంభించని వారు ఉంటే వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు ఆగిన వారి వివరాలు సేకరించి వెంటనే పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, ఎంపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలంటీర్‌తో మా కుటుంబానికి భరోసా..



వలంటీర్ వల్లే మా కుటుంబానికి భరోసా కలిగింది. మాది బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం గ్రామం. మాకు వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాతే వలంటీర్ కోటేశ్వరరావు దగ్గరుండి అన్నీ చూశాడు. ఇంటి పట్టా వచ్చింది. ఇల్లు కట్టుకుంటున్నాను. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా రావడానికి అవసరమైన కాగితాలు తీసుకెళ్లి మాకు వచ్చేలా చేశాడు.

జీ రాజేంద్రబాబు, ముక్తేశ్వరం

నా పరిస్థితి చెప్పగానే దరఖాస్తు చేసింది..



మాది అద్దంకి పట్టణంలోని 15వ వార్డు. నాపేరు గద్దం మస్తానమ్మ, నా భర్త మృతి చెందాడు. గతంలో వితంతు పింఛన్ పొందే అర్హత ఉన్నా పింఛన్ రాలేదు. కార్యాలయాల చుట్టూ సంవత్సరం పాటు తిరిగా.. అయినా రాలేదు. నాకు చదువు రాదు. ఎక్కడ అర్జీ ఇవ్వాలో కూడా తెలియదు. ఈ పరిస్థితుల్లో జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మా వార్డు వలంటీర్ అర్వపల్లి సీతారావమ్మ వచ్చింది. నా పరిస్థితి చెప్పగానే పింఛన్‌కు అప్లికేషన్ పెట్టడంతో పింఛన్ వచ్చింది.

గద్దం మస్తానమ్మ, అద్దంకి

సంక్షేమ పథకాలు అందాయి..



మాది కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామం. నాకు చదువు రాదు. ప్రభుత్వ పథకాల కోసం ఎక్కడికెళ్లాలో తెలియదు. ఈ పరిస్థితుల్లో మా వలంటీర్ సత్యవతి మా ఇంటికి వచ్చింది. పిల్లలను చదివించడానికి ఇబ్బంది పడుతున్న మాకు అమ్మఒడి, విద్యా దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా ఇప్పించింది. దాంతో మా కుటుంబానికి ఒక భరోసా కలిగింది. వలంటీర్ సేవలు మరువలేం.

పీ అంజమ్మ, తమ్మవరం

వలంటీర్ వలనే నాకు పింఛన్..



గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు వికలాంగ పింఛన్ కోసం అప్లికేషన్ పెట్టినా రాలేదు. విసుగెత్తి మానుకున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ వలంటీర్ గోపీ మా ఇంటికి వచ్చాడు. నన్ను చూసి పింఛన్ ఇంకా ఇవ్వలేదా.. నేను ఇప్పిస్తాను అని చెప్పి అప్లికేషన్ పెట్టి ఇప్పించాడు. అప్పటి నుంచి పింఛన్ వస్తోంది.

ఎన్ సింగయ్య, బూదవాడ, జే పంగులూరు మండలం

పనివాళ్లు కాదు.. సేవా వారధులు



అద్దంకిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



జే పంగులూరు మండలం బూదవాడలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

- ప్రజాసేవలో వలంటీర్లు
- నాలుగేళ్లుగా సేవలందిస్తూ ప్రజల మన్ననలు
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై దిగ్భ్రాంతి

అద్దంకి: గత ప్రభుత్వంలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందలేదు. ఎవరైనా పింఛన్ పొందాలంటే నాయకుడు, లేదా జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చేది. అలా కూడా అర్హులకు న్యాయం జరిగేది కాదు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఏర్పాటైన తరువాత, ప్రభుత్వ పథకాలను నేరుగా కుల, మత, వర్గ, పార్టీ రహితంగా అర్హులకు అందించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో ప్రతి 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించింది. వారంతా తమకు గౌరవ వేతనం పొందుతూ తమకు కేటాయించిన గృహాల్లోని అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తూ సేవలు తత్పరతను కొనసాగిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలోనూ వారు ప్రముఖ పాత్ర వహించి విశేష సేవలు అందించారు. వారి సేవలను పొందిన కుటుంబాల్లోని వ్యక్తులు తమకు అందిన సేవలపై సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ప్రతి ఒక్క వలంటీర్, లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి



సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి గ్రామాల వారీగా ప్రజల నుంచి లభిస్తున్న ఆదరాభిమానాలే జగనన్న పనితీరుకు నిదర్శనమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ గ్రామంలోని జగనన్న కాలనీ, ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, స్థానిక నేతలు, సచివాలయ సిబ్బందితో చైతన్య ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను అందజేస్తూ ఆయా కుటుంబాలు గత నాలుగేళ్లుగా పొందిన లబ్ధిని వివరించారు. రాబోయో ఎన్నికల్లో కూడా జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని చైతన్య ప్రజలను కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, కె రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, నాయకులు పావులూరు చందు షేక్, శ్రీనువలి, చల్లగుండ్ల కోటి స్వామి, షేక్ ఖాదర్, ప్రత్తిపాటి కిరణ్‌కుమార్, కందుకూరి పేతురు, జీ చిన ఆదెయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీడీటీ ఆవిర్భావ దినోత్సవం

చీరాల రూరల్: ఏపీపీడీటీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రావు మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ఏపీపీడీటీ పోరాటాలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఉద్యోగులకు పీఆర్సీ సాధించామని, ప్రభుత్వ ఉద్యోగులకు కాకుండా ఆర్టీసిలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి కూడా డీఏ సాధించినట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ నాయకుల కృషితో ఆర్టీసీ ఉద్యోగులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కాలువ శ్రీనివాసరావు, ఎ. బాబురావు, పి. రమేష్, శ్రీను, రెడ్డి, రావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



అద్దంకి: జగనన్న సురక్షలో సర్టిఫికెట్ అందజేస్తున్న కృష్ణచైతన్య



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న కరణం వెంకటేష్

- జగనన్న సురక్షలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య
- సర్టిఫికెట్లు పంపిణీ చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

మేదరమెట్ల/అద్దంకి రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే దృక్పథంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, రావినూతల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారు జగనన్న సురక్షలో సరైన సర్టిఫికెట్లు పొంది అర్హులు కావాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో తలపెట్టని కార్యక్రమాన్ని జగనన్న చేపట్టారన్నారు. ఎన్నికల ముందు ఇటువంటి కార్యక్రమాన్ని ప్రారంభించటం జగనన్నకు ప్రజల్లో ఆదరణకు నిదర్శనమన్నారు. అనంతరం అర్జీదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మేదరమెట్లలో 693, రావినూతలలో 818 సర్టిఫికెట్లు అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఎండీవో సురేష్‌బాబు, తహసీల్దార్ సుశీల, జగనన్న సురక్ష పర్యవేక్షణా అధికారి సురేంద్రబాబు, సర్పంచ్‌లు ఎలీశమ్మ, విజయవీణ, ఈవో శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అద్దంకి మండలంలోని కలవకూరు, వెంపరాల గ్రామాల సచివాలయాల వద్ద శాప్‌నెట్ చైర్మన్ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో దేవసేనకుమారి, అధికారులు, ఎంపీటీసీలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, స్థానిక నేతలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష..

చీరాల: ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని చీరాల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చీరాల రూరల్ మండలం రామకృష్ణాపురం–2 సచివాలయం పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేను చాలా ప్రభుత్వాలను చూశానని ఒక సర్టిఫికెట్ కోసం నెలలు, సంవత్సరాలు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం దేశంలో ఎవరూ చేయని విధంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను నేరుగా ఇంటివద్దకే అధికారులు, ప్రభుత్వ సిబ్బంది వచ్చి ఇవ్వడం పారదర్శక పరిపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీవో నేతాజీ, పి.కృష్ణ, దివి రామ్మోహనరావు, గుంటూరు వెంకట సుబ్బారావు, మాజీ సర్పంచ్ షేక్ అజాద్, పి.కోటయ్య, అందె సుబ్బారాయుడు, ధనుంజయ, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుందేరు ఆధునికీకరణపై సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల అర్బన్: కుందేరు ఆధునికీకరణ ప్రజా ప్రయోజనాలు కాపాడటంపై ప్రధాన రాజకీయ పార్టీల వైఖరిని ప్రకటించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా కుందేరు ఆధునికీకరణ గురించి మాట్లాడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రతినిధులు దురాక్రమణ గురవుతున్న కుందేరు పట్ల నిర్లప్తత ధోరణిని ప్రదర్శిస్తున్నారన్నారు. ఆక్రమణదారులు యథేచ్ఛగా వెంచర్లు వేసి అమ్ముకుంటున్నా, అనధికార కట్టడాలు జరుగుతున్నా నివారించాల్సిన అధికారులు ఆక్రమణదారులకు వంత పాడటం దారుణమన్నారు. ఆక్రమణలను తొలగించి కుందేరు నీరుపారుదలకు పోను మిగిలిన భూములను పేదలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి నలతోటి బాబూరావు, గుమ్మడి ఏసురత్నం, మోహనరావు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే జరిమానా



వాహనాలను ఆపి తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రసాద్

పర్చూరు (చినగంజాం): రోడ్డు నిబంధనలు పాటించకుండా నడుపుతున్న వాహనాలకు పర్చూరు ఎస్సై ఎస్ చెంచు ప్రసాద్ జరిమానా విధించారు. మంగళవారం సాయంత్రం చీరాల రోడ్డులో ఓవర్ లోడ్ వెళ్తున్న వాహనాలను, హెల్మెట్ లేని ద్విచక్ర వాహనాలను ఆపి ఆయన రోడ్డు నియమాలపై వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పరిమిత కుటుంబంతో ఆనందం



వేటపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కారంచేడు: ర్యాలీలో వైద్య సిబ్బంది



ఈపురుపాలెం పీహెచ్‌సీలో ర్యాలీ చేస్తున్న వైద్యులు



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

- ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీలు

చినగంజాం/కారంచేడు: పరిమిత కుటుంబంతో ఆనందం జీవించవచ్చని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వలన కలిగే అనేకమైన ఆర్థిక, సామాజిక సమస్యలు వస్తున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ పరిమిత సంతానం పాటించాలని, చిన్న కుటుంబం చింత లేని కుటుంబం అని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి, పీహెచ్ఎన్ బేబీ,హెల్త్ సూపర్‌వైజర్ హరిప్రసాద్, చిరంజీవి, ఉల్దారాణి, ఫార్మసిస్ట్ సుశీల, ఎల్‌టీ శ్యాం, సబ్ సెంటర్ సీహెచ్ఎస్‌లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షితమైన కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడమే మేలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సురేష్ అన్నారు. మంగళవారం జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. సురక్షితమైన పద్ధతులతోనే జనాభా నియంత్రణకు మేలు జరుగుతుందన్నారు. అందుకు పురుషులు నిరోధ్, గర్భనిరోధక మాత్రలు, ఐయూసీడీ, మాల–ఎన్ మాత్రలు వంటివి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాసరావు, వసంతవల్లి, సుబ్బారావు, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం/చీరాల టౌన్: ప్రతి కుటుంబం కుటుంబ నియంత్రణ పాటించాలని వైద్యాధికారి శ్యాంసన్ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆర్యోకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గురవమ్మ, డీపీఎం వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఈఓ చింతా శేషుబాబు, పిచ్చయ్య, జీ మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి ఆధ్వర్యంలో ఈపురుపాలెం గ్రామంలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రజలకు సేవలందిస్తే పేరు శాశ్వతం



ఉద్యోగులను సన్మానించి వీడ్కోలు పలుకుతున్న వైద్య సిబ్బంది

చినగంజాం: ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తే వారు పేరు శాశ్వతంగా నిలుస్తుందని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బదిలీపై వెళ్లిన ఆరోగ్య సిబ్బందికి వీడ్కోలు సభ నిర్వహించారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా హెల్త్ సూపర్‌వైజర్‌లు పీవీ సుబ్బారావు, రాజకుమారిలకు వైద్యాధికారి విజయభాస్కర్‌లు, వైద్యసిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. వారిని శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.

జాగ్రత్తలతో విషజ్వరాలు దూరం



హాస్టల్‌లో డీడీటీ చల్లిస్తున్న అధికారులు

చినగంజాం: విషజ్వరాల బారిన పడకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చీరాల సబ్ యూనిట్ అధికారి పీ శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం చీరాల సబ్ యూనిట్ పరిధిలోని హాస్టళ్లలో దోమల నివారణ మందు చల్లే కార్యక్రమంలో భాగంగా ఆయన చినగంజాం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో దోమలు అధికంగా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవడం ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ మురళీ, మహేష్ పాల్గొన్నారు.